APTEL /25/A2860

# సీమ వార్త

తెలుగు దినపత్రిక

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 190 | పేజీలు : 4 | గురువారం 16 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-


**విలేకరులు కావలెను**

సీమ వార్త తెలుగు దినపత్రిక ఏపీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల వారీగా బ్యూరో ఇన్చార్జులు స్టాఫ్ రిపోర్టర్లు ఆర్సి ఇన్చార్జిలు వెంటనే కావలెను అర్హత కనీసం డిగ్రీ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత

వివరాలకు సంప్రదించండి
చీఫ్ ఎడిటర్ బీరె ఈశ్వరయ్య
9490860881

## 24ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు

- టీఎంసీ దోచుకున్న ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తాం: అమిత్ షా
- బంగాల్‌లో ఎన్నికల ర్యాలీలో అమిత్ షా
- టీఎంసీ సర్కార్‌పై విమర్శలు
- అధికారంలోకి వచ్చాక గుర్ఖా నేతలపై కేసుల ఉపసంహరించుకోవాలని హామీ



## మాతృమూర్తి పేరిట మొక్క నాటాలి

- ఈ 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలి'
- ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి
- నీటి సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం నుంచి ఫిట్‌నెస్, సేవ వరకు 9 ప్రతిజ్ఞలు తీసుకోవాలని పిలుపు





## డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదు

- లోక్‌సభలో అన్ని రాష్ట్రాల వాటాను ఏకరీతిగా 50శాతం పెంచనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడి
- అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం: నిర్మలా సీతారామన్



## తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా
# నారా లోకేశ్

- 29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు
- జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10
- తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు

**అమరావతి**

తెదేపా కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్‌ను ప్రకటించింది. తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు. పొలిటిబ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఈ మేరకు పార్టీ ప్రకటించింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది. సీనియర్లకు గౌరవమిస్తూ..

- మిగతా3లో

# మారనున్న ముఖచిత్రం

- కొత్తగా 13 లోక్‌సభ నియోజకవర్గాలు
- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగే అవకాశం
- పునర్విభజనతో ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి, గుంటూరు తదితర చోట్ల పెరిగే అవకాశం
- ప్రస్తుతం ముగ్గురే మహిళా ఎంపీలు
- 33% రిజర్వేషన్‌తో భవిష్యత్తులో 12-13 మందికి అవకాశం



**అమరావతి**

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుల ద్వారా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల సీట్ల పునర్విభజన జరగనుంది. లోక్‌సభలో ప్రస్తుతం 543 స్థానాలు ఉండగా ఆ సంఖ్యను గరిష్టంగా 850కి పెంచే అవకాశం ఉంది. ఇందులో రాష్ట్రాలకు 815 స్థానాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మరో 35 సీట్లు కేటాయించనున్నారు. రాష్ట్రంలోనూ లోక్‌సభ నియోజక వర్గాల ముఖచిత్రం మారనుంది. పునర్విభజన బిల్లు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ స్థానాలు ఉండగా మరో 13 వరకు పెరిగే అవకాశం ఉంది. మహిళలకు 33% రిజర్వేషన్ల నేపథ్యంలో చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం కూడా

- మిగతా3లో

## అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం



- అమర్‌నాథ్ యాత్రకు ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా లక్షలాది భక్తులు
- ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతున్న అధికారులు



## నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయం తీసుకున్నాం

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేం మద్దతు ఇస్తున్నాం
- బిల్లు ప్రవేశపెడుతున్న విధానంపైనే మాకు అభ్యంతరం
- రాజకీయ దురుద్దేశంతో ఈ బిల్లు తెస్తున్నారు
- బిల్లుకు వ్యతిరేకంగా విపక్షాలన్నీ పోరాడుతాయి: ఖర్గే

# బాలికలదే పైచేయి

- ఇంటర్ ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్
- ప్రథమ సంవత్సరం 77 శాతం మంది, ద్వితీయ సంవత్సరంలో 81 శాతం ఉత్తీర్ణత
- విజయం సాధించలేకపోయిన విద్యార్థులు నిరుత్సాహపడవద్దని మంత్రి లోకేశ్ సూచన
- రెండో సంవత్సరం బాలురు 76 శాతం, బాలికలు 85 శాతం
- మొదటి ఏడాది 4,71,864 మంది పరీక్షలకు హాజరుకాగా 3,61,526 మంది ఉత్తీర్ణత



**అమరావతి**

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ప్రథమ సంవత్సరం 77 శాతం మంది, ద్వితీయ సంవత్సరంలో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండింటిలోనూ బాలికలే పై చేయి సాధించారు. మొదటి సంవత్సరానికి సంబంధించి గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు కాగా ద్వితీయ సంవత్సరంలో రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం కావటం విశేషం. ఈ సారి విజయం సాధించలేకపోయిన విద్యార్థులు నిరుత్సాహపడకుండా ఒక పాఠంగా తీసుకుని మరింత కృషి చేసి తిరిగి విజయాన్ని సాధించాలని మంత్రి లోకేశ్ సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం విద్యార్థులకు మానసికంగా తోడ్పాటునందించాలని

- మిగతా3లో

## ఏపీలో నేటి నుంచే
# జనగణన

- తొలుత హౌస్ లిస్టింగ్
- సెన్సస్ అధికారి జె.నివాస్
- రాష్ట్రంలో నేటి నుంచి సెన్సస్ ప్రక్రియ ప్రారంభం
- కేంద్ర, రాష్ట్ర ప్రణాళికలకు సెన్సస్ ప్రామాణికమని తెలిపిన సెన్సస్ అధికారి జె.నివాస్
- దీనికి ప్రజలు పూర్తిగా సహకరించాలని పిలుపు



**అమరావతి**

నేటి నుంచి ఏపీలో సెన్సస్ 2027 ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఏపీ జనగణన అధికారి జె. నివాస్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రణాళికలకు సెన్సస్ ప్రామాణికమని తెలిపారు. ప్రస్తుతం జరిగేది 16వ సెన్సస్ అని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వ సెన్సస్ అని నివాస్ వివరించారు. జనాభా గణన ఫిబ్రవరిలో ప్రారంభమవుతుందని, ఈ లోపు హౌస్ లిస్టింగ్ జరుగుతుందని స్పష్టం చేశారు. సెన్సస్ ప్రక్రియకు ప్రజలు పూర్తి సహకరించాలని కోరారు. ఎన్యూమరేటర్లకు అవసరమైన వివరాలు తప్పకుండా అందించాలని, ఇంటి నంబర్లు నమోదు చేసే ప్రక్రియకు ఎటువంటి అడ్డంకులు పెట్టొద్దని తేల్చిచెప్పారు. సెన్సస్ సమాచారం ప్రభుత్వ పథకాలకి కీలక ఆధారమని నివాస్ చెప్పారు. సెన్సస్‌కు అడ్డంకులు కల్పిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. "కేంద్ర, రాష్ట్ర ప్రణాళికలకు సెన్సస్ ప్రామాణికం.

- మిగతా3లో



## మన తలలపై వేలాడుతున్న కత్తి మనపైనే పడింది

- డీలిమిటేషన్‌పై భగ్గుమన్న తమిళనాడు సీఎం
- తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలకు చారిత్రక అన్యాయం వెల్లడి
- బీజేపీ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని వ్యాఖ్య
- ఏప్రిల్ 16న నల్లజెండాలతో నిరసనకు పిలుపు

## మొదటి అరెళ్ల పిల్లల్లో పెరిగే మెదడే అభివృద్ధికి కీలకం.

..... పోషణ పక్వాడ అవగాహన కార్యక్రమాల్లో....సూపర్వైజర్ రాధ.

గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త.



గోరంట్ల మండలంలోని కలిగేరీ, నర్సినపల్లి, దేవుల చెరువు అంగన్వాడి కేంద్రాల్లో పోషణ్ పఖ్వాడా 7 వ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోమందేపల్లి సిడిపిఓ డాక్టరు శాంత లక్ష్మి,హాజరయ్యారు. సూపర్వైజర్ రాధ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా నిర్వహించారు. చిన్నపిల్లల అభివృద్ధికి సరైన పోషకాహారం కీలకమని పేర్కొన్నారు .రెండు సంవత్సరాల లోపు పిల్లల మెదడు 80%అభివృద్ధి చెందు ను కనుక పిల్లలను మొబైల్, టీవీ వంటి స్క్రీన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. అలాగే ప్రాసెస్డ్ ఫుడ్స్, రెడీ-టు-కుక్, రెడీ-టు-ఈట్ ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించి, ఇంటి వంట సహజ ఆహారాన్ని ప్రోత్సహించాలన్నారు. అధిక సోడియం, చక్కని కలిగిన ఆహార పదార్థాలు మెదడు అభివృద్ధి కి హానికరమని హెచ్చరించారు. చిప్స్, కుర్కురే, ఐస్ క్రీమ్ వంటి జంక్ ఫుడ్స్కు బదులుగా శెనగలు, పప్పులు, పల్లీలు, పాప్కార్న్, పండ్లు వంటి ఆరోగ్యకరమైన స్నాక్స్ను వినియోగించాలని సూచించారు.పిల్లల జీవితం లో మొదటి 5 సంవత్సరా లు చాలా విలువైన కాలము. కావున ఈ వయసులో వారి కి మంచి ఆహార పు అలవాట్లు పై మంచి పునాది ఏర్ప రాస్తే వారి తరువాతి జీవితకాలం జీవన శైలి జబ్బులు ఐన డయాబెటిస్ రక్త పోటు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి అని వివరించారు.ఏమి తెలియని మట్టి ముద్ద లాంటి పిల్లల కు మన సౌకర్యం కోసం ప్రాసెస్ చేసిన ఆహారం అలవాటు చేయవద్దు అని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పద్మ , నాగరత్న, నిర్మల, లబ్దిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యం... మంత్రి సవితమ్మ ట్రస్ట్ చే బస్సు షెల్టర్ కు శ్రీకారం.

.... ఎస్ ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయంతో... పాలసముద్రం క్రాస్ లో బస్సు సెంటర్ ఏర్పాటుకు భూమి పూజ.





గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త.

గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ పంచాయతీ ఎన్. హెచ్.44 పాలసముద్రం క్రాస్ కదిరి వైపు ఎస్ ఆర్ ఆర్ చార్టబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్, రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత మ్మ ఆదేశాలతో బుధవారం బస్టాండ్ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పాలసముద్రం, వడిగేపల్లి ,రెడ్డిచెరువురు పల్లి పంచాయితీ తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భూమి పూజ కార్యక్రమం లో పాలుపంచుకున్నారు. దీంతో ప్రయాణికులు మంత్రి సవితముకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో పాలసముద్రం సహకార బ్యాంకు అధ్యక్షులు చంద్ర,సాగునీటి సంఘం అద్యక్షులు హరనాథ్ రెడ్డి,నిడిమామిడప్ప,మనోహర్, కె.జయచంద్ర రెడ్డి, కె.మూర్తి, సం జీవప్ప , సుబాన్, పుర్రోళ్ళ ఆదినారాయణ, రామలింగారెడ్డి, హరీష్, ఇర్షాద్,రాజు రెడ్డి,చంద్రశేఖర్, చంద్రనాయక్, సాలెప్ప ,రామంజినప్ప, వెంకటరమణ, నాగరాజు,ఆంజనేయులు(ఫీల్డ్ అసిస్టెంట్) గంగిరెడ్డి, కాటేపల్లి అంజి, రాగిమేకుల పల్లి నాగరాజు, నరసింహప్ప ,శ్రీరాములు ,అదిశేషు, కాటే పల్లి అశ్వర్థ,నారాయనప్ప,లింగప్ప, మల్లి,క్రాస్ మల్లి, బావక్కగారి మూర్తి, యు.గంగాధర్,పరమేశ్ నాయక్,రామస్వామి నాయక్,కోగిర శ్రీనివాసులు,శ్రీరమప్ప,తిపన్న,గంగరాజు,లక్ష్మీనారాయణ, షామీర్,అనిల్,భాస్కర్,శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు.

## మండల ద్వితీయ టాపర్ గా జూనియర్ కళాశాల విద్యార్థిని

అమరాపురం ఏప్రిల్ 15 సీమవార్త



మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల యందు ద్వితీయ సంవత్సరం బైపిసి ఇంటర్ నందు 1000 మార్కులకు గాను 982 మార్కులు సాధించి మండల ద్వితీయ టాపర్ గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ రామకృష్ణ నాయక్ తెలిపారు. అదేవిధంగా ఎంపీసీ గ్రూప్ నందు ఎం కీర్తన 980 మార్కులు, ఎల్ వైష్ణవి 977 మార్కులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి సంవత్సరం నందు 500 మార్కులకు గాను షణ్ముఖి 480 మార్కులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ద్వితీయ ఇంటర్లో ఎంపీసీ బైపిసి హెచ్ఈసి సీఈసీ గ్రూపుల్లో 105 మంది విద్యార్థులకు 95 మంది ఉత్తీర్ణత సాధించినట్లు, అదేవిధంగా మొదటి సంవత్సరం నందు 198 మందికి గాను 148 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. మండల ద్వితీయ టాపర్ గా జూనియర్ కళాశాల విద్యార్థిని లక్ష్మీదేవి మంచి మార్పులు సాధించడం ద్వారా కళాశాల అధ్యాపక బృందానికి ప్రిన్సిపాల్ అభినందించారు. అదేవిధంగా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం అభినందించారు

## తుంగభద్ర డ్యామ్ క్రస్ట్‌గేట్ పనులు వేగవంతం -- సరైన నిర్వహణతో 70 ఏళ్ల మన్నిక:

- నిపుణుడు కన్నయ్య నాయుడు హామీ

బళ్లారి, ఏప్రిల్ 15 సీమవార్త:

తుంగభద్ర డ్యామ్ క్రెస్ట్‌గేట్ మార్పిడి పనులు తుది దశకు చేరుకున్నాయని, సరైన నిర్వహణ చేస్తే కొత్త గేట్లు 50 నుంచి 70 ఏళ్ల వరకు మన్నికగా ఉంటాయని క్రెస్ట్‌గేట్ నిపుణుడు కన్నయ్య నాయుడు తెలిపారు. మంగళవారం డ్యామ్ వద్ద గేట్ల ఏర్పాటు పనులను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "నిర్వహణ లేకపోతే, గేట్లు సుమారు 20 ఏళ్లు మాత్రమే పనిచేస్తాయి. అయితే, ప్రతి ఏటా సరైన నిర్వహణ చేస్తే, వాటిని ఎలాంటి సమస్యలు లేకుండా 70 ఏళ్ల వరకు ఉపయోగించవచ్చు" అని వివరించారు.

జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ సభ్యుడైన ఆయన, గేట్ల భద్రతకు సంబంధించి ధృవీకరణ పత్రం జారీ చేసిన తర్వాత ఎలాంటి సందేహాలకు తావు ఉండదని స్పష్టం చేశారు. "ఇక్కడ పనులు సాంకేతికంగా పరిపూర్ణంగా జరిగాయి," అని ఆయన అన్నారు.

**పనులు తుది దశలో ఉన్నాయి:**

తుంగభద్ర డ్యామ్‌లోని మొత్తం 33 క్రస్ట్ గేట్లలో, 26 గేట్లను అమర్చారు. వీటిలో 15 గేట్లను విజయవంతంగా అమర్చడం జరిగింది. కొన్ని గేట్లకు స్లిమ్ ప్లేట్ అమర్చే పని జరుగుతోంది. చివరి గేటు అమర్చే పని మంగళవారం ప్రారంభమైంది, ఇది శనివారం నాటికి పూర్తి అవుతుందన్నారు. వెల్డింగ్ పనులు ఈ నెలాఖరుకు పూర్తవుతాయి, చైన్ లింక్ భాగాలు మే 11 నాటికి చెన్నైకి చేరుకుంటాయి. చైన్ అమర్చడం మినహా మిగిలిన పనులన్నీ మే 15 నాటికి పూర్తి చేస్తామని కన్నయ్య నాయుడు తెలిపారు.



**వర్షంలో కూడా పనులు చేయవచ్చు:**

చైన్ లింక్ అమర్చే ప్రక్రియ అంత కష్టమైనది కాదు. ఒక రోజులో ఒక గేటుకు చైన్లను అమర్చవచ్చు.

రిజర్వాయర్‌లో నీరు నిలిచి ఉన్నప్పటికీ ఈ పని చేయవచ్చు. అందువల్ల, మే మధ్యలో భారీ వర్షాలు కురిసినా నీటి నిల్వకు ఎలాంటి ఆటంకం ఉండదని ఆయన హామీ ఇచ్చారు.

**రూ.51 కోట్ల వ్యయంతో కీలకమైన ప్రాజెక్ట్:**

తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఓ.ఆర్.కె. రెడ్డి ఈ పనిని మొత్తం రూ.51 కోట్ల వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. గేట్ల నిర్మాణానికి రూ.44 కోట్లు, చైన్ లింక్‌ల ఏర్పాటుకు రూ.5.1 కోట్లు, కన్సల్టెన్సీ ఖర్చుల కింద రూ.1.34 కోట్లు కేటాయించారు. కాంట్రాక్టర్లకు ఇప్పటివరకు రూ.29.5 కోట్లు చెల్లించినట్లు ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ నారాయణ్ నాయక్, ఇంజనీర్లు జ్ఞానేశ్వర్, కిరణ్ పాల్గొన్నారు.

**నీటి నిల్వ సామర్థ్యం: 100 టీఎంసీల లక్ష్యం**

133 టీఎంసీల సామర్థ్యం గల తుంగభద్ర జలాశయంలో సుమారు 31 టీఎంసీల మేర పూడిక పేరుకుపోయినట్లు అంచనా. దీని ఫలితంగా, జలాశయం యొక్క వాస్తవ నీటి నిల్వ సామర్థ్యం సుమారు 102 టీఎంసీలుగా ఉంది. అయినప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా 100 టీఎంసీల నీటిని నిల్వ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

రుతుపవన వర్షాలు తగినంతగా కురిస్తే, రైతులకు రెండు కాలాల్లోనూ నీరు అందుబాటులో ఉంటుందని కన్నయ్య నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు.

**క్రమమైన నిర్వహణ ముఖ్యం**

మొత్తం 33 గేట్లకు ప్రతి మూడేళ్లకు ఒకసారి, అంటే ప్రతి ఏడాది 11 గేట్లకు నిర్వహణ చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ చర్యను కచ్చితంగా పాటిస్తే, క్రెస్ట్ గేట్ల దీర్ఘకాలిక మన్నికకు హామీ లభిస్తుందని నిపుణులు తెలిపారు. తన అభ్యంతరాల తర్వాత ప్రభుత్వం నిధులు విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, పనులకు ఆటంకం కలిగించనందుకు కన్నయ్య నాయుడు మీడియాకు ధన్యవాదాలు తెలిపారు.

## పార్లమెంటులో 33 శాతం మహిళా రిజర్వేషన్: 2029లో నారీశక్తి ప్రభావం --- హేమలత నాయక్

బళ్లారి, ఏప్రిల్ 15 సీమవార్త:

రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికలలో మహిళలకు 33% రిజర్వేషన్ అమలు చేయబడుతుందని, పార్లమెంటులో నారీశక్తికి బలమైన ప్రాతినిధ్యం లభిస్తుందని శాసన మండలి సభ్యురాలు, రాష్ట్ర బిజెపి మహిళ నాయకురాలు హేమలత నాయక్ విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని బిజెపి పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అమలు దిశగా కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన అడుగు వేసిందని, పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఒక చారిత్రాత్మక పరిణామమని అన్నారు. "మహిళా రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభ, రాజ్యసభలలో ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదించినప్పటికీ, అది అమలు కాలేదు. కానీ ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దానిని అమలు చేయడానికి ఒక సాహసోపేతమైన



నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో, 2029 నాటికి మహిళలకు ఖచ్చితంగా 33% ప్రాతినిధ్యం లభిస్తుంది," అని ఆమె పేర్కొన్నారు. గతంలో పార్లమెంటులో మహిళా సభ్యుల నిష్పత్తి కేవలం 4% మాత్రమే ఉండేది. బసవరాజేశ్వరి, నాగమ్మ కేశవమూర్తి వంటి నాయకుల స్ఫూర్తితో ఎందరో మహిళలు రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2019 నాటికి మహిళా సభ్యుల సంఖ్య 15 శాతం పెరిగిందన్నారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై దేశవ్యాప్తంగా మంచి స్పందన ఉందని, ప్రతిపక్ష పార్టీల అభ్యంతరాలు ఉన్నప్పటికీ దానిని అమలు చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. 2029 ఎన్నికల నాటికి మహిళలు తమ హక్కుగా దక్కాల్సిన రిజర్వేషన్‌ను పొందుతారని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు. మహిళా సాధికారత దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వం 'డ్రోన్ దీదీ', 'ముద్ర' వంటి వివిధ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని, దీని ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా శక్తివంతమవుతున్నారని ఆయన అన్నారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ సుధ, విజయలక్ష్మి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు హంపి రమణ, నాయకులు డా.అరుణ కామినేని, డాక్టర్ రేణుకా మంజునాథ్, అలువేలు, సాధన హిరేమఠ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## తనకల్లు కస్తూరిబా ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులు విజయకేతనం....









తనకల్లు ఏప్రిల్, 15 సీమ వార్త న్యూస్...

తనకల్లు మండల పరిధిలోని స్థానిక కస్తూరిబా ఇంటర్ కళాశాల విద్యార్థులు విజయ డంకా మారుమ్రోగించారు. ఈ సందర్భంగా కస్తూరిబా కళాశాల ప్రిన్సిపాల్ అమీదాబి మాట్లాడుతు విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యంశాలను శ్రద్ధగా విని, క్రమశిక్షణ తో చదివి మంచి మార్కులు సాధించిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తున్నాము అని అన్నారు. విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ రిజల్ట్ వదినప్పుడు మేము రిజల్ట్ చేస్తే మా విద్యార్థులు సాధించిన మార్కులు చూస్తే చాలా ఆనందం గా ఉందని అన్నారు. ఈ విజయం వెనుక మా పాఠశాల సిబ్బంది ఖఠోర దిక్ష, వారి శ్రమ ఫలితమే ఈ విద్యార్థులు ఫలితాలు సాధనకు వారి కృషి ఎంతో ఉందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం లో దీ అనిత 435/455 వీ నందిని, వీ జానకి 420/455,420/455 కాంతిరేఖ 870/1000 సిందూర 860/1000 ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ 15 విద్యార్థులు హాజరు కాగా 15 మంది పాస్ కావడం జరిగింది 100% రిజల్ట్ రావడం చాలా ఆనందశీగ ఉందన్నారు. విద్యార్థులు తల్లితండ్రులు ఇంతటి విజయాన్ని అందించిన కళాశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేస్తు హర్షం వ్యక్తం చేసారు.ఇంటర్ మొదటి సంవత్సరం కు అడ్మిషన్స్ జరుగుతున్నవి ఏప్రిల్ 20 ఆఖరి తేదీ కావున ఆసక్తి ఉన్న వారు అప్లై చేసువాచ్చని ప్రిన్సిపాల్ తెలియజేసారు

## సొంతూరు మారెమ్మ గుడికి... మోహన్ రెడ్డి ఫ్యామిలీ ఆర్థిక సాయం.

... ఆలయ చైర్మన్ దేవి స్వామికి రూ, 50 వేల116 అందజేసిన దాతలు.



**గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త:** మేజర్ పంచాయతీ పరిధిలోని గుమ్మయ్య గారి పల్లి గ్రామంలో వెలసిన మారెమ్మ ఆలయ నిర్మాణానికి ధనవంతు బాధ్యతగా అదే గ్రామానికి చెందిన కొమ్మూరు మోహన్ రెడ్డి, నిర్మల దంపతులు రూ 50,116 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ చైర్మన్ దేవి స్వామికి దాతలు నగదును అందజేశారు. దాతలకు చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేసి ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఇంటర్ లో మెరిసిన... .జర్నలిస్టు తనయ నిత్యశ్రీ.

....1000కి 978 మార్కులతో జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ.

....తల్లి ఆశయమే లక్ష్యంగా కష్టపడి చదివిన విద్యార్థిని



రాప్తాడు, ఏప్రిల్ 15 సీమ వార్త.

విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాప్తాడు మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ శ్రీనివాసులు, దివంగత ఉమాదేవి దంపతుల కూతురు నిత్యశ్రీ అద్భుత ప్రతిభ కనపరిచింది. ఇంటర్ బైపీసీ విభాగంలో ఈమె 1000 మార్కులకు గాను 978 మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. ?బాల్యం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించిన నిత్యశ్రీ, ఇంటర్మీడియట్ చిలమత్తూరు మండలం టేకులోడులోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభ్యసించింది. ఏడాది క్రితం తల్లి ఉమాదేవి అనారోగ్యంతో మరణించినప్పటికీ, ఆ బాధను దిగమింగుకుని తన తల్లి కలను సాకారం చేయాలనే దృఢ సంకల్పంతో ఏమాత్రం కుంగిపోకుండా చదివి ఈ విజయాన్ని సొంతం చేసుకుంది. ?తండ్రి, విశాలాంధ్ర రాప్తాడు రిపోర్టర్ బుడగల శ్రీనివాసులు, పెద్దమ్మ కుమారి, బీటెక్ సెకండియర్ చదువుతున్న సోదరుడు అక్షయ్ సాగర్, కుటుంబ సభ్యులు మరియు కళాశాల ఉపాధ్యాయుల నిరంతర ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించానని నిత్యశ్రీ పేర్కొంది. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజానికి సేవ చేయడమే తన లక్ష్యమని ఆమె తెలిపింది. ఒక సాధారణ జర్నలిస్టు కుటుంబం నుంచి వచ్చి, ప్రభుత్వ కళాశాలలో చదువుతూ అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల స్థానిక ప్రజలు, బంధువులు మరియు జర్నలిస్టు మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ నిత్యశ్రీని అభినందించారు.

# బాలికలదే పైచేయి

-మొదటిపేజీ తరువాయి

కోరారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో మొదటి సంవత్సరం బాలుర 72 శాతం, బాలికలు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం బాలురు 76 శాతం, బాలికలు 85 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి ఏడాది 4,71,864 మంది పరీక్షలకు హాజరుకాగా 3,61,526 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాది 4,46,537 మంది పరీక్షలు రాయగా 3,59,816 మంది ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి ఏడాది 38,443 మంది పరీక్ష రాయగా 23,569 మంది పాస్ అయి 61 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాది ఒకేషనల్ కోర్సుల్లో 33,852 మంది పరీక్ష రాస్తే 25,151 మంది పాసై 74 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

**మే 21 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు**

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 92 శాతంతో కృష్ణా, గుంటూరు 88 శాతం, ఎన్టీఆర్ జిల్లాలు 87 శాతంతో అగ్రస్థానంలో నిలిచాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో చివరి స్థానంలో చిత్తూరు 71శాతం, వైఎస్సార్ 71 శాతం, అన్నమయ్య జిల్లాలు 67 శాతంతో నిలిచాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కృష్ణా 90 శాతం, గుంటూరు 88 శాతం, విశాఖ జిల్లాలు 85 శాతంతో అగ్రస్థానంలో నిలిచాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో చివరి స్థానంలో వైఎస్సార్ 66 శాతం, నంద్యాల 66 శాతం, అన్నమయ్య జిల్లాలు 62 శాతంతో ఉన్నాయి.

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఏప్రిల్ 20 నుంచి 27వ తేదీ వరకూ అవకాశం ఉంది. మే 21 నుంచి జూన్ 4 వరకూ థియరీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ 7 నుంచి 11 వరకూ ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. జూన్ 5న ఎథిక్స్, హ్యూమన్ వాల్యూ, జూన్ 6న పర్యావరణ విద్య



పరీక్షలు నిర్వహించనున్నారు. ఫలితాలు https://resultsbie.ap.gov.in ద్వారా పొందే అవకాశం ఉంది. మన మిత్ర వాట్సప్ నంబరు 9552300009 ద్వారాను ఫలితాలు చూసుకునే వెసులుబాటు కల్పించారు. ఫోన్ నంబరుకు హాయ్ అని సంక్షిప్త సందేశం పంపించి, ఫలితాలు పొందే సదుపాయం కల్పించారు.

అన్ని వర్గాల సమిష్టి కృషే కారణం: గత 12 ఏళ్లలోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది ఫలితాల్లో నమోదైందని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ జూనియర్ కళాశాలల్లో గణనీయమైన పురోగతి కనిపించిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత శాతం 54 శాతంగా నమోదై గత 12 ఏళ్లలో అత్యధికంగా నిలిచిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో 68 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు కావడం కూడా గత 12 ఏళ్లలో రెండో అత్యుత్తమ ఫలితంగా నిలిచిందని తెలిపారు. ఈ విజయానికి విద్యార్థుల కృషి, ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్ల శ్రమతో పాటు అన్ని వర్గాల సమిష్టి కృషి కారణమైందని అభినందించారు. ఫలితాల వివరాలను ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్ భాష వివరించారు.

# రాజ్యసభకు ఊహించని పేర్లు

**విజయవాడ :** ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి ప్రారంభం అయింది. ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు రాజ్యసభ సభ్యులు జూన్ 21న పదవీ విరమణ చేయనున్నారు. అందుకే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వారి స్థానంలో కొత్త వారి ఎన్నికల కోసం నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధపడింది. కూటమికి ఏకపక్షంగా బలం ఉండడంతో.. వారి ఖాతాలోనే ఈ నాలుగు రాజ్యసభ స్థానాలు పడనున్నాయి. అయితే ఆశావహులు చాలామంది ఉన్నారు. కానీ 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థుల ఎంపిక కు శ్రీకారం చుట్టింది కూటమి. అయితే అన్ని పార్టీల్లోనూ ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. కానీ ఈసారి కొత్త వారికి ఛాన్స్ ఇస్తారని ప్రచారం నడుస్తోంది. అదే సమయంలో సీనియర్లు సైతం పదవులు ఆశిస్తున్నారు.ఏపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వాని, సానా సతీష్ పదవి విరమణ చేయనున్నారు. అయితే ఇందులో సతీష్ టీడీపీకి చెందిన నేత. ఏడాది కిందట ఆయన రాజ్యసభకు ప్రమోట్ అయ్యారు. అప్పట్లోనే మరోసారి రెన్యువల్ ఇస్తామని టిడిపి నాయకత్వం హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు టిడిపికి రెండు.. జనసేన, బిజెపికి చెరో ఒక రాజ్యసభ పదవి ఇస్తామన్న ఒప్పందం పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన టిడిపికి రెండు పదవులు దక్కనున్నాయి. అందులో ఒక్కటి సానా సతీష్ కు ఖరారు అయింది. మిగతా పదవి కోసం పార్టీలో చాలామంది ఆశావహులు ఉన్నారు. అనూహ్యంగా భారత్ బయోటెక్ అధిపతి ఎల్లా కృష్ణా పేరు వినిపిస్తోంది. మరోవైపు గల్లా జయదేవ్ సైతం రేసులో ఉన్నారు. యనమల రామకృష్ణుడు తో పాటు వర్ల రామయ్య పేరు కూడా వినిపిస్తోంది. జూనియర్ల కోటాలో చింతకాయల విజయ్ సైతం రాజ్యసభ పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.జనసేనకు సంబంధించి అనేక పేర్లు తెరపైకి వస్తున్నాయి. అయితే ఆది నుంచి ప్రముఖంగా



వినిపించిన పేరు లింగమనేని రమేష్. ప్రముఖ పారిశ్రామిక వ్యాప్తంగా ఉన్న ఆయన 2024 ఎన్నికల్లో జనసేనకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. పైగా సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు కూడా. అయితే మరోవైపు అల్లు అరవింద్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. కానీ మొగ్గు మాత్రం లింగమనేని రమేష్ వైపు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పవన్ కళ్యాణ్ ఇష్టం పై ఆధారపడి ఉంటుంది. తొలి రాజ్యసభ పదవి జనసేనకు. అందుకే పవన్ కళ్యాణ్ ఆచితూచి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.భారతీయ జనతా పార్టీ ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందా అనే చర్చ నడుస్తోంది. అయితే రాష్ట్రం నుంచి ఆ పార్టీలో ఆశావహులు చాలామంది ఉన్నారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే ఏపీ నుంచి తమిళ నాడు రాష్ట్రానికి చెందిన నేత అన్నామలైను రాజ్యసభకు పంపిస్తారన్న ప్రచారం ఉంది. ప్రస్తుత తమిళనాడు ఎన్నికల్లో అన్నామలై పోటీ చేయడం లేదు. అందుకే ఏపీ నుంచి రాజ్యసభ పదవి ఇచ్చి ఆయనను క్యాబినెట్ లోకి తీసుకుం టారన్న టాక్ నడుస్తోంది. మరోవైపు పారిశ్రామిక కోటాలో పరిమళ్ నత్వానికి మరో ఛాన్స్ ఉంటుందన్న ప్రచారం కూడా ఉంది. మరి ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయో చూడాలి.

# సింహాచలం భక్తుల భద్రత కోసం ఏఐ

**విశాఖపట్టణం :** సింహాచలం అప్పన్న ఆలయంలో చందనోత్సవానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఏప్రిల్ 20న చందనోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత.. ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భక్తుల భద్రత కోసం తొలిసారిగా ఏఐ వినియోగించనున్నట్లు అనిత తెలిపారు. సీసీటీవీ కెమెరాల ద్వారా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సింహాచలం చందనోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. సింహాచలం అప్పన్న ఆలయంలో ఏప్రిల్ 20వ తేదీన చందనోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అప్పన్న నిజరూప దర్శనం టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో భక్తులకు నిజరూప దర్శనం టికెట్లు జారీ చేస్తున్నారు. చందనోత్సవానికి ఈ ఏడాది సుమారుగా రెండు లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. భక్తుల భద్రత కోసం సింహాచలం ఆలయంలో తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవం సందర్భంగా సింహగిరిపై భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం పరిశీలించారు. ఈ ఏడాది సుమారు 2 లక్షల



మంది భక్తులు స్వామివారి నిజరూప దర్శనం కోసం వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో.. సామాన్య భక్తుల దర్శనానికి పెద్దపీట వేయనున్నట్లు అనిత తెలిపారు. ఆరోజు తెల్లవారుజామున మూడు గంటల నుంచే సింహాచలం ఆలయంలో దర్శనాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భక్తుల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు తొలిసారిగా ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు వంగలపూడి అనిత వెల్లడించారు.అలాగే ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సింహాచలం కొండపై పది చోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని.. నిరంతరాయంగా మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి అనిత తెలిపారు.రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. అత్యవసర సేవల కోసం ఎన్డీఆర్ఎఫ్ , ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ఆలయం వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, స్వామివారి నిజరూప దర్శనం , ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్? హోం మంత్రి వివరించారు. సింహాచలం చందనోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.మరోవైపు చందనోత్సవం సందర్భంగా సింహాచలం లో గంధం అరగతీత కార్యక్రమానికి శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రాల సాక్షిగా ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఆలయ ఆచారం ప్రకారం గంధం అరగతీత కార్యక్రమం మూడు రోజులు కొనసా గుతుంది. గంధం అరగతీత కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు.

## తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్

-మొదటిపేజీ తరువాయి

కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ.. సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి అధిష్ఠానం పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం కల్పించింది. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు చేశారు.

29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు

జాతీయ ప్రధాన కార్యదర్శులు–3, జాతీయ ఉపాధ్యక్షులు–18, జాతీయ అధికార ప్రతినిధులు–10

రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు–7, రాష్ట్ర ఉపాధ్యక్షులు–16, రాష్ట్ర అధికార ప్రతినిధులు–14, రాష్ట్ర జోనల్ కో–ఆర్డినేటర్లు–10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు–59, రాష్ట్ర కార్యదర్శులు–77.

ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్చార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం. పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్.

రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం.

జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు

185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించిన తెదేపా

బీసీ–77, ఎస్సీ–25, ఎస్టీ–7, మైనార్టీ–13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు

2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి కమిటీల కూర్పు చేపట్టిన చంద్రబాబు

## మారనున్న ముఖచిత్రం

-మొదటిపేజీ తరువాయి

ఇదే స్థాయిలో పెరగనుంది. కేంద్రం 2011 జనాభా లెక్కల ప్రాతిపదికగా లోక్‌సభ నియోజకవర్గాల పెంపును ప్రతిపాదిస్తోంది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పరిశీలిస్తే విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణా, చిత్తూరు, అనంతపురం, తదితర జిల్లాల్లో లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం ఉంది. తెనాలి లాంటి రద్దయిన లోక్‌సభ స్థానాలు కూడా మళ్లీ ఏర్పాటవుతాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం అవకాశాలు ఇలా: 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 4.95 కోట్లు ఉండగా, ఇందులో మహిళల సంఖ్య 2.47 కోట్లు. అయితే ఆంధ్రప్రదేశ్ నుంచి లోక్‌సభకు ప్రస్తుతం ముగ్గురు మహిళలు దగ్గుబాటి పురందేశ్వరి, బైరెడ్డి శబరి, గుమ్మళ్ల తనూజ మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 33% రిజర్వేషన్ల అమలు ద్వారా 12 నుంచి 13 మంది మహిళలకు లోక్‌సభలో అడుగుపెట్టే అవకాశం దక్కనుంది.

**ఎస్సీ లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం**

రాష్ట్రంలో ఎస్సీ జనాభా 84.69 లక్షలు. ప్రస్తుతం 4 లోక్‌సభ నియోజకవర్గాల్ని వీరికి కేటాయించారు. ఉమ్మడి జిల్లాల లెక్కన చూస్తే గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో 9.57 లక్షల మంది చొప్పున ఎస్సీలు ఉన్నారు. తర్వాత స్థానంలో కృష్ణా జిల్లాలో 8.71 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 8.23 లక్షల మంది ఉన్నారు. ఈ జిల్లాల పరిధిలో ఎస్సీ లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశాలున్నాయి.

**మహిళలకు ప్రాతినిధ్యం**

ఎస్సీ మహిళలు అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లాలో 4.82 లక్షలు, గుంటూరు 4.81 లక్షలు, కృష్ణా జిల్లాలో 4.35 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 4.13 లక్షల మంది ఉన్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా ఈ జిల్లాల నుంచి ఎస్సీ మహిళలకు ప్రాతినిధ్యం దక్కవచ్చు. రాష్ట్రంలో మొత్తం ఎస్టీ జనాభా 27.40 లక్షలు. ప్రస్తుతం అరకు నియోజకవర్గం ఎస్టీలకు కేటాయించారు. ఎస్టీలు అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 6.18 లక్షలు మంది ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 2.97 లక్షలు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 2.85 లక్షలు, గుంటూరు జిల్లాలో 2.47 లక్షలు, విజయనగరం జిల్లాలో 2.35 లక్షల మంది ఎస్టీలున్నారు. ఎస్టీ మహిళల జనాభా అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 3.16 లక్షలు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 1.40 లక్షలు ఉంది.

## ఏపీలో నేటి నుంచే జనగణన

-మొదటిపేజీ తరువాయి

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వ సెన్సస్ ఇది. జనాభా గణన ఫిబ్రవరిలో జరుగుతుంది. ఈలోగా ఇంటి లెక్కలు పూర్తవుతాయి. సెన్సస్ ప్రక్రియకు ప్రజలు పూర్తిగా సహకరించాలి. ఇంటి నంబర్ల నమోదు ప్రక్రియకు ఎలాంటి అడ్డంకులు పెట్టవద్దు. సెన్సస్ సమాచారమే ప్రభుత్వ పథకాలకు కీలక ఆధారం. సెన్సస్‌కు అడ్డంకులు కల్పిస్తే క్రిమినల్ చర్యలు”

**ప్రజలంతా భాగస్వాములు కావాలి**

జనగణన 2027 తొలిదశలో భాగంగా ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు స్వీయ గణన జరుగుతుందని ఇందులో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డాక్టరు లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. జనగణనలో తొలిసారిగా ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. https://se.census.gov.in పోర్టల్ ద్వారా ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని చెప్పారు. దీనివల్ల సమయం ఆదాతో పాటు దోష రహితంగా కచ్చితమైన డేటా లభిస్తుందని వివరించారు. 34 అంశాలను ఈ గణన ద్వారా ప్రజలు తమ వివరాలను తెలియజేయాల్సి ఉంటుందని కలెక్టరు అన్నారు. స్వీయ గణనపై ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని 16వ తేదీన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ, ఎంపీపీలు, ఛైర్‌పర్సన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను స్వీయ గణనలో భాగస్వామ్యం చేస్తామని వెల్లడించారు. అలాగే 17వ తేదీన సచివాలయ సిబ్బంది, హెచ్‌వోడీ కార్యాలయాల సిబ్బంది, జిల్లా కార్యాలయాల సిబ్బంది, మండల కార్యాలయాల సిబ్బంది తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇలా ఏప్రిల్ 30వ తేదీ వరకు వివిధ వర్గాల ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

## పక్కా వ్యూహాలతో తమ్ముళ్లు..

**విజయవాడ :** తెలుగుదేశం పార్టీ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు అటాక్ అనేది ఆ పార్టీ స్ట్రాటజీ కాదు. రాజకీయ విమర్శలు వస్తే దానికి ధీటైన కౌంటర్ ఇవ్వడమే ఆ పార్టీ నేతలు చేసే పని. కానీ ఇటీవల పరిణామాలు చూస్తుంటే మాత్రం ముందే టిడిపి మంత్రులు అటాక్ చేయడం చూస్తుంటే మాత్రం ప్రత్యేక వ్యూహం ఉన్నట్టు అర్థమవుతుంది. జగన్ మావిగన్ రాజధాని ప్రతిపాదన తర్వాత రకరకాలుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. సరిగ్గా అదే సమయంలో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సెగలు పుట్టించాయి. అయితే ఆయన ఒక్కడే కాదు. ఆ తరువాత మంత్రి పయ్యావుల కేశవ్. అటు తరువాత మంత్రి వంగలపూడి అనిత, చివరకు నిమ్మల రామానాయుడు.. ఇలా అంతా వరుసగా మీడియా ముందుకు వచ్చి సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుపెన్నడూ లేని విధంగా టిడిపి మంత్రులు ఈ తరహా అటాక్ చేయడం వైసీపీకి నిద్ర పట్టడం లేదు.సాధారణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువగా కౌంటర్ అటాక్ ఉంటుంది. దీనిపైనైనా మూకుమ్మడి దాడి ఆ పార్టీ పుణ్యమే. అది వారికి అలవాటైన విద్య కూడా. కానీ టిడిపి మాత్రం అలాంటి విమర్శలు వచ్చినప్పుడు వాటికి సమాధానం చెప్పడమే. అదేపనిగా దానిని లాగి బయటకు ప్రచారం చేయడం ఉండదు. కానీ ఫస్ట్ టైం టిడిపి మంత్రులు అటాక్ చేయడం ప్రారంభించారు. తండ్రి అధికారం కోసం జగన్మోహన్ రెడ్డి ఎంత ఆరాటపడ్డారు.. ప్రస్తుతం వైసీపీలో ఉన్న నేతలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పై ఏవిధంగా మాట్లాడారు అన్న విషయాలను గుర్తు చేస్తూ అచ్చెనాయుడు చేసిన కామెంట్స్ ఏపీ పొలిటికల్ వర్గాల్లో ప్రకంపనలు రేపాయి. తరువాత అదే స్థాయిలో మాట్లాడారు పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత. చివరకు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా హత్య గురించి ప్రస్తావిస్తూ వైసిపి పై విమర్శలు చేశారు.అయితే ఈ మొత్తం పరిణామాలతో మావిగన్ రాజధాని ప్రతిపాదన హైలెట్ అయింది. దానికి వ్యతిరేక ప్రచారం తోడైంది. వాస్తవానికి మావిగన్ పై వచ్చిన వ్యతిరేకతను.. అనుకూలంగా మార్చుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. మూడు నెలల పాటు దానికి టార్గెట్ పెట్టుకుంది. అదే పనిగా మావిగన్ ప్రచారం చేస్తే ప్రజల్లో క్రమేపి సానుకూలత వస్తుందని అంచనా వేసింది.

## కదిరి పేలుడులో మృతులకు ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

సోమందేపల్లి ఏప్రిల్ 15 సీమ వార్త



కదిరి మండలం కుమ్మరవాండ్ల పల్లిలో జరిగిన గ్యాస్ సిలెండర్ల పేలుళ్లలో మృతుల కుటుంబాలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న తెలిపారు.అలాగే గ్యాస్ సిలిండర్ల పేలుళ్ల మృతులకు ఒక్కొక్క కుటుంబానికి 50 లక్షలు,గాయపడిన ఒక్కొక్క కుటుంబానికి 25 లక్షలు నష్టపరిహారంతో ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ పాలకులు, ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పరామర్శించాలన్నారు. అదేవిధంగా ఘటనపై సోషియల్ మీడియాలో వస్తున్న వాటి ఆధారంగా తక్షణమే దర్యాప్తు జరిపి వాస్తవ విషయాలను గుర్తించి చట్ట బద్ధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుండుమలతిప్పేస్వామి నియామకం పట్ల హర్షం

అమరాపురం ఏప్రిల్ 15 సీమవార్త



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగాగుండుమల తిప్పేస్వామిని2వ సారి నియమాకం పట్ల బుదువారం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ నందు బాణసంచ కాల్చి హర్షం వ్యక్తం చేశారు. జన నాయకుడికి రెండోసారి పదవి రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణమూర్తి,టిడిపిజిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయ కుమార్, జడ్పిటిసి పి ఆర్ నరసింహమూర్తి, మండల క్లస్టర్ కన్వీనర్లు నవీన్ కుమార్, కృష్ణమూర్తి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు రఘు, మార్కెట్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా, విరూపాక్ష, మాజీ సర్పంచులు సేకన్నప్ప, లోకేష్, డైరెక్టర్ దాదాపీర్ ,శివలింగప్ప, నాగరాజు, టైలర్ రామాంజి, స్టూడియో హనుమంతు, మాజీ ఎంపిటిసి లింగరాజు తదితరులు పాల్గొన్నారు

## జనసేన నేత అరిగెల భాస్కర్ కి కంటి చికిత్స.

పరామర్శించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్.

ధర్మవరం ఏప్రియల్ 15, సీమ వార్త :



ధర్మవరం పట్టణానికి చెందిన జనసేన పార్టీ నాయకులు అరిగెల భాస్కర్ తన కంటి చికిత్స ఆపరేషన్ చేయించుకున్నందున, ఆ విషయం తెలుసుకున్న ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అరిగెల భాస్కర్ ఇంటికి వెళ్లి తన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించి, అరిగెల భాస్కర్ తో మాట్లాడుతూ, మీరు తొందరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పే స్వామికి ఘనంగా సన్మానం



**మడకశిర ఏప్రిల్ 15 సీమ వార్త :**అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా నూతనంగా నియమించబడిన హెచ్ రామాంజనేయులు మంగళవారం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లను ఘనంగా సన్మానించారు. మారుమూల ప్రాంతమైన నియోజకవర్గంలోని గుడిబండ మండలం జంబలబండ గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణ కులానికి చెందిన నన్ను అన్నవరం దేవాలయం కమిటీ మెంబర్గా నియమించడానికి కృషిచేసిన మడకశిర శాసనసభ్యులు టిటిడి పాలక మండలి సభ్యులు ఎం యస్ రాజు ని , మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి ని ఘనంగా సన్మానించడం జరిగింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారిని కలిసి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుంచితి ఒక్కరిగా రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కన్వీనర్లు నాగరాజు, నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ నరసింహారాజు, సింగల్ విండో అధ్యక్షులు నరేష్ కన్నా, బూదిపల్లి జయరాం, రవి, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్గా నారా లోకేష్ ఎన్నిక కావడం పట్ల హర్షం



**ఓబులదేవరచెరువు (ఏప్రిల్16)సీమవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ ఎన్నిక కావడం సంతోషకరమని మాజీ జెడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి,కన్వీనర్ శెట్టి వారి జయచంద్ర,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కంచి సురేష్ నాయకులు కొత్త సుధాకర్ రెడ్డి,బుద్దల గోపీనాథ్ రెడ్డి తదితర నాయకులు తదితర నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ.... తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నారా లోకేష్ ప్రతిభను గుర్తించి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడంతో భవిష్యత్తులో టిడిపి జాతీయ స్థాయిలో మరింత పటిష్టమవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# వేసవిలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తరాదు ....ఎంపీపీ....

- మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు..
- సమావేశానికి గైర్హాజరు అయిన వారిపై చర్యలు
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ

గాండ్లపెంట, ఏప్రిల్ 15 సీమవార్త...

వేసవిలో ఎక్కడా కూడా మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల సహాయ సహకారాలతో మండలంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎక్కడ ఏ చిన్న నీటి సమస్య తలెత్తిన వాటిని వెంటనే పరిష్కరించాల్సిందిగా సూచించారు. అదేవిధంగా వేసవిలో ఎండ వేడిమికి ప్రభుత్వ వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. అదేవిధంగా మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ట్రాన్స్కో, అటవీ శాఖ, తదితర శాఖల అధికారులు గైర్హాజరపై ఎంపీపీ మండిపడ్డారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై తప్పనిసరిగా చర్యలు



..సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి.

తీసుకోవాల్సిందిగా ఎంపీడీవోకు సూచించారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ జేఈ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో జలజీవన్ పథకం కింద ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మండలంలో అక్కడక్కడ ప్రస్తుతం ఉన్నటువంటి నీటి ఎద్దడిని పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో సిహెచ్ఓ నాగేంద్ర మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా ప్రజలకు ఎండ వేడి మీపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా గర్భిణీ స్త్రీల పట్ల తమ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి వారికి ఎప్పటికప్పుడు తగిన వైద్యం అందిస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏవో షాదాబ్ మాట్లాడుతూ సబ్సిడీ ధరతో రైతులకు జిప్సం అందజేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా యాంత్రికరణ పనిముట్లు కూడా రైతులకు సబ్సిడీతో అందజేస్తామని తెలియజేశారు. మండల వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వం విడుదల చేసిన నిధులు రైతులకు ఖాతాల్లో జమైనట్లు తెలిపారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షురాలు గంగోజమ్మ మాట్లాడుతూ కటారుపల్లి గ్రామంలో క్షేత్ర సహాయకుడు తనకు అనుకూలమైన వారికి మాత్రమే పనులు కల్పిస్తున్నారని సమావేశంలో తెలియజేశారు. అంతేకాకుండా అర్హులైన కూలీలకు పనులు కల్పించకుండా కూలీల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే స్పందించిన ఏపీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ జాబ్ కార్డ్ కలిగిన ప్రతి కూలీకి తప్పనిసరిగా పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో తహసిల్దార్ బాబురావు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈఓ కృష్ణ నాయక్, పశువైద్యాధికారి చెన్నకేశవులు, ఎస్ ఓ దుర్గ, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మాతమ్మ, ఎంపీటీసీ జయ రామకృష్ణారెడ్డి, మండలంలోని గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# బత్తలపల్లి, ఇందిరమ్మ కాలనీలో సమస్యల పరిష్కారానికి మంత్రి తక్షణ చర్యలు

- వీధి దీపాలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభం
- 20వ తేదీలోపు సీసీ రోడ్లు, డ్రైనేజ్ అంచనాలు సిద్ధం చేయాలి
- కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి మంత్రి కట్టుబడి ఉన్నారు

ధర్మవరం రూరల్ (బత్తలపల్లి) ఏప్రిల్ 15 సీమవార్త :--





ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం నిర్వహించిన మా ఊరు -- మన జెండా కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి ఇందిరమ్మ కాలనీని సందర్శించి అక్కడి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను ఆత్మీయంగా విన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వీధి దీపాల లేమి, సీసీ రోడ్ల అభావం, డ్రైనేజ్ కాలువల సమస్యలు, తాగునీటి కొరత వంటి అంశాలను వివరించారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆయన నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబుని మండల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు బుధవారం మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు,బత్తలపల్లి మండల ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈ అధికారులను సమన్వయం చేసుకొని మండల అధికారులతో కలిసి ఇందిరమ్మ కాలనీని ప్రత్యక్షంగా సందర్శించారు. కాలనీలో తక్షణమే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను హరీష్ బాబు సూచించారు. అదేవిధంగా, ఈ నెల 20వ తేదీ లోపు సీసీ రోడ్లు మరియు డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వెంటనే స్పందించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి ప్రజాహిత దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని హరీష్ బాబు అన్నారు. కాలనీలో మౌలిక వసతుల కి మరియు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మంత్రి కట్టుబడి ఉన్నారని హరీష్ బాబు తెలిపారు.

## నారాలోకేష్,బాలకృష్ణ,బీకే పార్థసారథి లకు పదవులు రావడంతో తెదేపా నాయకుల సంబరాలు



సోమందేపల్లి ఏప్రిల్ 15 సీమ వార్త

తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులను నియమించడంతో మండల టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఐటి, విద్యా శాఖల మంత్రి నారాలోకేష్, తెదేపా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ, తెదేపా పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఎన్నుకోవడంతో టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు . ఈ సందర్బంగా బుధవారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, బాణా సంచా పేల్చారు. అనంతరం స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపాల్, టీడి బాబా, అశ్వర్థ,మాగే చెరువు రామాంజనేయులు,జెసిబి మారుతి,రామచంద్ర, లక్ష్మన్న, మైలార్ యాదవ్, కదిరప్ప,రామాంజినేయులు, రామచంద్ర,ఓబులేష్ యాదవ్, కాచర్ల నరేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కదిరి పేలుడు సంఘటనలో ఆర్టీసీ డ్రైవర్ మృతి.....



**నంబులపూలకుంట: ఏప్రిల్ 15 (సీమవార్త):** కుమ్మరవాండ్లపల్లి లో పేలుడు ఘటనలో నంబులపూలకుంట మండలం గోవిందరాజులపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ విశ్వనాథ రెడ్డి ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల ప్రకారం, పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో విశ్వనాథ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. మృతుడి పార్థివ దేహాన్ని కదిరి నియోజకవర్గ వైసీపి సమన్వయకర్త బిఎస్ మక్బూల్ అహ్మద్, మండల వైసీపీ కన్వీనర్ కొత్త రంగారెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వనాథ రెడ్డి మృతి చాలా బాధాకరమని, వారి కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం.. డిప్యూటీ డిఎంహెచ్వో భాగ్యలక్ష్మి

ధర్మవరం రూరల్ ఏప్రిల్ 15 సీమవార్త :



పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సీజనల్ వ్యాధులపై మెడికల్ ఆఫీసర్లకు సూపర్వైజర్లకు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ భాగ్యలక్ష్మి, డి ఎం ఓ డాక్టర్ చెన్నారెడ్డి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ ,చికెన్ గున్యా, వ్యాధులపై ప్రజలకు అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. ఎక్కడా ఎటువంటి వ్యాధులతో మృతి చెందకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. ప్రజల ద్వారా ఫిర్యాదులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మలేరియా ఆఫీస్ వెంకటేష్, గోపి నాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం, ఎం పి హెచ్ ఈ ఓ లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నేత్రదానం తో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన నేత్ర దాత.



ధర్మవరం ఏప్రియల్ 15, సీమ వార్త :



ధర్మవరం సాలేవీధి కి చెందిన చేనేత కార్మికుడు కీ,శే సరోదే విశ్వనాథ్ (53 సం ) 15/4/2026 రాత్రి గుండెపోటుతో మరణించగా విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం సభ్యులు వారి కుటుంబ సభ్యులను నేత్రదానంపై అవగాహన కల్పించి అనంతపురం రెడ్ క్రాస్ డివై కుల్లాయప్ప కంటి రెట్రావైల్ సెంటర్ ఆధ్వర్యంలో టెక్నీషన్ జి రాఘవేంద్ర ఉదయం కంటి కార్నియా సేకరించడం జరిగింది . నేత్రదానానికి సహకరించిన దాత కుమారులు సరోదే చిరంజీవి, చంద్రశేఖర్ అక్క భువనేశ్వరి అల్లుడు లక్ష్మీనారాయణ, ఆనందబాబు కుమార్తె లక్ష్మీదుర్గ గారికి సేవా సంఘం వారు కృతజ్ఞతలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో ఫౌండర్ కోళ్ళమొరం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షులు గాజుల సురేష్ ఉపాధ్యక్షులు టి చంద్రశేఖర్ రెడ్డి . జూజారు రఘు సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881